

## గురువును కాల్చిన శిష్యుడు....

మాట వినని శిష్యులను దండించిన గురువుల సంగతి అందరికీ తెలిసిందే. శిష్యులను దండించినప్పుడు సహజంగా శిష్యులు గురువుకు ఎదురుతిరుగుతారు. తోటి వారి ముందు తమను తిట్టినందుకు ఎదురు సమాధానం చెప్పడం, లేకపోతే కొన్ని రోజుల పాటు ఆ క్లాస్‌ను ఎగ్గొట్టడం అనేది విద్యార్థులు సహజంగా చేసే పని. అంతకు మించి గురువు మీద దాడి చేయాలన్న ఆలోచన శిష్యులకు రాదు. ప్రస్తుతం వస్తున్న సినిమాల ప్రభావమో, టీవీల మహిమో తెలియదు కానీ, యూనిఫామ్ విషయంలో మందలించిన గురువు మీదే రివాల్వర్‌తో కాల్పులు జరిపి, తీవ్రంగా గాయపరిచిన శిష్యుడి ఉదంతం ఇది. గురుదక్షిణగా ఆ శిష్యుడు గురువు ప్రాణాలకే ఎసరు పెట్టాడు. అందరూ ముక్కుమీద వేలేసుకునే ఈ సంఘటన లక్నోలో జరిగింది. వివరాల్లోకి వెళితే...

లక్నోలోని ఓ హైస్కూలులో పదవ తరగతి చదువుతున్న శివమ్ త్రివేది ఓరోజు యూనిఫాం వేసుకోకుండా స్కూలుకి వెళ్లాడు. ఈ విషయమై డిసిప్లిన్ పాటించడం లేదంటూ, క్లాస్ టీచర్ త్రివేదిని కోప్పడ్డాడు. క్లాసులో అందరి ముందు కోప్పడినందుకు త్రివేదికి కోపం వచ్చినా వెంటనే తిరిగి ఏమీ అనకుండా మౌనంగా ఉండిపోయాడు. ఆ తరువాత ఇంటికి వెళ్లి తండ్రి రివాల్వర్‌ను జేబులో వేసుకొని స్కూలుకు తిరిగి వచ్చాడు. లంచ్ అవర్‌లో స్కూలు బయటకు వచ్చిన ఆ క్లాస్ టీచర్ మీద త్రివేది కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన క్లాస్ టీచర్‌ను వెంటనే చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కి తరలించినట్లు పోలీసులు తెలిపారు. త్రివేది తండ్రి లక్నోలో డివిజనల్ రైల్వే మేనేజర్‌గా పనిచేస్తున్నాడని పోలీసులు తెలిపారు. సంఘటన అనంతరం త్రివేదిని అదుపులోకి తీసుకొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపట్ల స్కూలు యాజమాన్యం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తున్నారు.

'సరసి'కత

వైశంపాయనుడా మధ్య భార్య సుబ్బాయమ్మ గారితో కలిసి ఓ పెళ్లికి ముంబాయి వెళ్లొచ్చాడు. ముంబాయిలో రైలెక్కి పూనా వచ్చే సరికి భోజనాల వేళయింది. సుబ్బాయమ్మ గారు వద్దంటున్నా వినకుండా స్టేషనులో దిగి 'కెఫెటేరియా'లో కెళ్లాడు వైశంపాయనుడు. లోపల హాలులో భోజనం చేస్తూ, గుమ్మంలోంచి ఎదురుగా కనిపిస్తున్న కంపార్టుమెంటు వైపు ఓ కన్నేసి వుంచాడు. రైలుంది కదా అనే ధీమాతో కుశాలుగా ఎక్కువసేపు తిని, కట్టుకున్న లుంగీకి చెయ్యి తుడుచుకుంటూ కొద్ది సేపటికి మెల్లగా, ఈల వేసుకుంటూ బయటకు వచ్చిన వైశంపాయనుడి గుండె గుభేలుమంది.

రైలు వెళ్లిపోతూ అల్లంత దూరంలో కనిపించింది. తను అంతవరకూ చూస్తున్నది అక్కడే పూనాలో ఉండిపోయే కంపార్టుమెంటన్నమాట! దాన్ని కట్ చేసుకుని మిగిలిన రైలు వెళ్లిపోతూ కనిపించేసరికి వెర్రి కేకలు పెడుతూ ప్లాట్‌ఫారం మీద పరుగు పెట్టాడు వైశంపాయనుడు. రైలు దాటిపోతే తనగతి దుర్గతే. భర్త ఎక్కకుండా రైలు కదిలి పోయే

# డింభకుని సాహసం




సరికి, సుబ్బాయమ్మ గారు ధైర్యం చేసి గొలుసు లాగేసింది. రైలాగిపోయింది. వైశంపాయనుడు గుండెలవిసిపోయేలా ఆయాసపడుతూ, వూడిపోతున్న లుంగీని అస్తవ్యస్తంగా చుట్టుబెట్టుకుంటూ రైలులో కొచ్చి పడ్డాడు. గార్డు కంపార్ట్‌మెంటుదగ్గర కొచ్చి గొలుసు ఎవరు లాగేరని వేరే భాషలో అడిగేడు. ఎవరూ మాట్లాడకపోయేసరికి, అదే భాషలో తిట్టుకుంటూ వెళ్లిపోయాడు. రైలు కదిలింది.

వైశంపాయనుడి కాలికి ఒకే చెప్పు ఉండటం చూసింది సుబ్బాయమ్మగారు. ''రెండో చెప్పు ప్లాట్‌ఫారం మీద పడిపోయినట్టుంది'' అన్నాడు వైశంపాయనుడు రొప్పుతూ. ముచ్చట పడి తను ఆ చెప్పుల్ని ముంబాయిలో కొనుక్కున్నాడు.

''అదిలా ఇవ్వండి''అంది సుబ్బాయమ్మ గారు, అతడి ఎడమ కాలి చెప్పుని చూపిస్తూ.

భయపడుతూనే తీసిచ్చాడు వైశంపాయనుడు.

''మొదటి చెప్పు దొరికిన వాడికి ఇది కూడా దొరికితే సంతోషిస్తాడు'' అంటూ దాన్ని ప్లాట్ ఫారం మీదకి విసిరేసిందామె. వైశంపాయనుడు స్థిమితపడి,సంతోషించాడు తన మీద ఆ చెప్పుని ఆమె ప్రయోగించనందుకు.

*